

– చింతా ప్రభాకరరావు

అర్ధరాత్రి పన్నెండు గంటల సమయం.

హఠాత్తుగా నేతాజీపేట అంటుకొంది.

పేటలోని వాళ్ళంతా నిరుపేదలు. అన్నీ పూరిగుడిసెలు. మంటలు కార్చిచ్చులా పెరిగిపోతున్నాయి.

ఆ ప్రాంతానికల్లా పలుకుబడి ఉన్న వ్యక్తి గంగాధరరావు.

మంచి ఒడ్డూ పొడుగూ ఉన్న విగ్రహం. వయస్సు నలభై అయిదు సంవత్సరాలుంటాయి.

ఇంద్రభవనంవంటి ఇల్లు, ఆతనిది, ఎటువంటి కార్చిచ్చు పెచ్చరిల్లినా చెక్కు చెదరని గట్టిదనం దాని కుంది. ఆ సమయంలో పై అంతస్తులో సోఫాలో కూర్చుని అతను ఒక్కడే మేల్కొని ఉన్నాడు. మనిషిలో ఆందోళన ఖచ్చితంగా కనిపిస్తున్నది. సోఫా ముందు బల్లపై ఫోను ఉంది.

ఒకళ్ల తరవాత ఒకళ్ళుగా నలుగురికి ఫోన్ చేశాడు వెంట వెంటనే.

నేతాజీపేట తగులబడిపోతున్నదనీ, ఎందరో అభాగ్యులు వీథిపాలై పోతున్నారని, తెల్లవారేసరికి నిలువ నీడ లేక, తినడానికి తిండి లేక వారంతా నానా ఇబ్బందులకు లోనుగావడానికి వీల్లేదని, పొద్దు పొడవకముందే పది బస్తాల బియ్యం, వంటసామాన్లు, గోనెడేరాలు సిద్ధం చేసి ఎంత ఖర్చయినా లెక్క చేయకుండా అక్కడి ప్రజలకు అన్ని ఏర్పాట్లూ చెయ్యవలసిందిగా వారిని ఆదేశించాడు.

దూరంగా ఉన్న నేతాజీపేట నుండి హాహాకారాలు పెద్ద గోలగా వినిపిస్తున్నాయి. మంటలు ప్రచండ వేగంతో పైపైకి లేస్తున్నాయి. అంతా స్పష్టంగా కనిపిస్తున్నది మేడపై కూర్చున్న గంగాధరరావుకి.

"ఇంతకీ అగ్నిమాపకదళానికి ఫోన్ చేశావా, నాన్నా!" త్రుళ్ళిపడి గంగాధరరావు వెనక్కి తిరిగి చూశాడు. కూతురు అక్కడ ఉన్నట్టు ఇంతవరకూ అతనికి తెలియదు.

పిట్టగోడ దగ్గరున్న స్తంభానికి జారగిలబడి తదేకంగా మంటలవంక చూస్తున్నది జయప్రద. పెళ్ళైన రెండేళ్ల లోనే భర్తను పోగొట్టుకున్న విధవరాలామె. నాలుగేళ్ళుగా పుట్టింట్లో పడి ఉన్న అభాగ్యురాలు.

"ఫోన్ చేసి ఏం లాభం, తల్లీ! చుట్టుపక్కల ఎక్కడా సీటివనరు లేదు కదా?"

"అలా అని ఊరుకోవడం భావ్యం కాదు, నాన్నా! నీరు గురించి ఆలోచించేది వాళ్లు. వాళ్లకి తెలియపరచడం మన మొట్టమొదటి విధి."

"హోరుమని కొంప అంటుకొన్నప్పుడు వారు మాత్రం ఏం చేస్తారమ్మా? అయినా ఆ పేటకి ఉన్నాడుగా ఓ నాయకుడు! వాడ్పాటికే వెళ్ళి ఫోన్ చేసి ఉంటాడులే."

"ఎందుకు, నాన్నా, సత్యం మీద నీ కంత అక్కసు? నాలుకలు చాచుకొంటూ విజృంభిస్తున్న ఆ మంటల్ని చూసి అతని గుండె లెంతగా అవిసిపోతాయో నీకు అర్థం కాదు, నాన్నా."

కోపంగా సోఫాలోంచి లేచి కూతురు దగ్గరి కొచ్చి నిలుచున్నాడు గంగాధర రావు. జయప్రద కదల్లేదు. ఇటు తిరిగి చూడనైనా లేదు తండ్రి వంక.

"ఆ సత్యంగాడి గురించే కదమ్మా మొన్న ఎలెక్షన్లో నేను చిత్తుగా ఓడిపోత! ఏం, నే నేం తక్కువ చేశానని? ఆ డాక్టరమ్మ సరస్వతీదేవి ఏం ఒరగ బెట్టేసిందని! ఈ మెషీన్ కుట్టుకొని బ్రతికే విధవ సన్నాసి కాస్త సైడ్ చేస్తే ఆ సరస్వతీదేవి నెగ్గగలుగునా? అందుకే వాణ్ణి మన గుమ్మం ఎక్కనివ్వ వద్దంటాను. నా మాట నువ్వా లెక్క చేయవు."

"అత నెంతో పవిత్రుడు, నాన్నా! నువ్వనుకొంటున్నంత తక్కువతనం అతనిలో ఎక్కడా కనిపించదు."

విపరీతమైన కోపంతో వణికి పోయాడు గంగాధరరావు. "ఛీ! ఛీ! నా మాటకూడా కాదని వాణ్ణి వెనకేసుకు రావడానికి నీకు సిగ్గు వేయటం లేదూ?"

కాస్తయినా చలించలేదు జయప్రద.

"ఉన్నమాట అనుకోవడానికిసిగ్గెందుకు పడాలి, నాన్నా? అయినా అతను పిలవ కుండా మనింటికి ఎప్పుడు వచ్చాడూ? నాలుగు రోజుల క్రితం కుట్టడానికి ఏవో గుడ్డలున్నాయంటే వచ్చాడు. నిన్న నేదో తినడాని కింత పెడతామంటే వచ్చాడు. పోనీ, నువ్వే చెప్పరాదూ అతనికి—మా ఇంటి కింక రావద్దని?"

"వాడికా! నేనా? తెలిసి తెలిసి జ్ఞాన మున్న వా డెవ్వడూ వాణ్ణెదిరించి మాట్లాడ్డం ఇంతవరకూ నే చూళ్లేదు. అస లీ తప్పంతా మీ అమ్మది. దానికి బుద్ధుంటే నీ సలహాలన్నీ వింటుందా! ఇంట్లో ఏ వంటకం వండినా వాడికికూడా వాటా వేయడం కుదురుతుందా!"

"అర్ధరాత్రి అమ్మ నెందుకు



రాధా మాధవం

చిత్రం—టి. వై. గిరి (లింబా)

తిడతావులే, నాన్నా! చీకటి పడిందగ్గ ర్నుంచి బాధతో మెలి తిరిగిపోతున్నది. అదెక్కడి తగని రోగమో! ఒకటే ఆయాసం. దానితోనే అమ్మ ఎప్పుడో అకస్మాత్తుగా చచ్చిపోతుంది."

టటాలున కన్నీళ్లు తుడుచుకొంది జయప్రద.

మంటల్లో పడి మ్రగ్గిపోతున్నది పేట పేటంతా. ఏడుపులూ పెడ బొబ్బలూ గొల్లున వినవస్తున్నాయి.

కూతురు అన్న మాటలకు దుఃఖంతో విచలితుడయ్యాడు గంగాధరరావు. కుంగి పోతున్న స్వరంతో అన్నాడు: "తరగని రోగంతో అదీ, చెరిగిన బొట్టుతో నువ్వూ— నిత్యం నా బ్రతుకును రంపపు కోత కొయ్యడానికే నాకు సంప్రాప్త మయ్యారు. ఎంత సంపదుండి ఏం లాభం లే- ఖర్మ ఇలా కాలిపోతున్నప్పుడు!"

గట్టిగా నిట్టూర్చి తన గదిలోకి వెళ్లిపోయాడు గంగాధరరావు. కాస్సేపటి కల్లా గణగణ శబ్దాలు చేసుకొంటూ రెండు ఫైర్ఇంజన్లు వచ్చాయి. శక్తి వంచన లేకుండా కృషి ప్రారంభమైంది. ఆ వంకకే చూస్తూ అలా ఎంతసేపు అక్కడ నిలుచుని ఉండిపోయిందో జయ ప్రదకే తెలియదు. తెల్లవారి ఆరు గంట లకుగాని మంటలు అదుపులోకి రాలేదు.

దాదాపు రెండు వందల కొంపలు పరశురామప్రీతి అయిపోయాయి. వాడ వాడంతా శ్మశానం క్రింద తయా రయింది. కాపాడుకొన్న సామాన్లతో, పిల్లా పాపలతో వీధుల్లో జనం శరణార్థుల్లా బారులు తీరి కూర్చొని ఉన్నారు.

గంగాధరరావు ఆదేశించిన ప్రకారం సర్వ సంభారాలూ నేతాజీపేటకు రావించ బడ్డాయి. డేరాలు వేయడం, వంటలు చేయడం— ఎంచి కోలాహలంగా ఉంది.

ఎవరెవరు ఏయే వస్తువులు రక్షించుకో గలిగారు? ఎవరికి ఎంత నష్టం సంభవిం చింది? ఎవ రెలా ఒళ్లు కాలి బాధ పడు తున్నారు? ఒక్కొక్క వార్త బయటికి పొక్కుతున్నది.

ఎనిమిది గంటలకు కాలకృత్యాలన్నీ తీర్చుకొని తెల్లని ఉడుపులు ధరించి మేడ దిగి వచ్చి సావిట్లో సోఫాలో స్థాయిగా కూర్చున్నాడు గంగాధరరావు.

ఆ ఇంటికి ఊళ్లో వార్తలన్నీ నిత్యం మోసుకువచ్చే వార్తాహరుల్లో మొట్ట మొదటివాడు రామశర్మ. పౌరోహిత్యం చేసుకొని బ్రతుకుతుంటాడు. ఎదుటి వాడికి ఎలాటి సలహా కావాలో గ్రహించి అదే సలహా ఇవ్వడంలో మంచి దిట్ట. కూలికి విషం తాగాలంటే పెద్ద అభ్యంత రం చెప్పడు. చెప్పుచుట్టుకొని చదివితే పొట్టనిండా నవ్వి ఊరుకొంటాడు.

ఎంతో ఆనందంతో ఓ ముఖ్యమైన వార్తను తెచ్చి ఉన్నాడు రామశర్మ. వస్తూనే— "రావుగారూ, విన్నారా? సత్యానికి ఒళ్లు బాగా కాలిందంట. హాస్పిటల్లో ఉన్నాడు. ఇంతకీ తమ రే వెళ్లి చూసి వస్తేకూడా" అన్నాడు.

అప్రయత్నంగా ముఖం కాస్త విప్పా రింది గంగాధరరావుకు.

"ఆ. . .అలానా! రా, ఇలా కూర్చో" అన్నాడు ఎంతో ఆదరంగా.

శర్మ కూర్చున్న తరవాత— "ఒళ్లు బాగా కాలిందేం? అసలేం జరిగిందో చెప్పవయ్యా వివరంగా" అన్నాడు చాలా ఆసక్తిని వ్యక్తం చేస్తూ.

"ఏం జరుగుతుందండీ! తన కంటూ ఓ కొంప లేకపోయినా పేటలో కొంప లన్నీ తనవే నన్నట్టు హోరుకొంటే ఏమవుతుంది? ఒళ్లు కాస్త కాలి ఊరు కొంది. దానికేంగాని, రావుగారూ, ఊరు ఊరంతా మీ పేరే మ్రోగిపోతున్న దనుకోండి. తెల్లవారికల్లా ఎన్ని వసు పాయాలకుపూనుకొన్నారు! ఎన్ని ఏర్పాట్లు చేశారు! నిజంగా మీరు మనుషులు కాదండీ! . ."

పట్టలేని ఆనందంతో లేచి పచార్లు చేయడం ప్రారంభించాడు గంగాధరరావు. ఏదో తీయని అనుభూతితో మనస్సు ఉరకలు వేయసాగింది.

"చూడు, శర్మా! పేటలో సహాయ కార్యక్రమాలు ఏవి జరిగినా అన్నీ మన

పేరుమీదే జరగాలి. ఎంత ఖర్చయినా కూడా ఏమీ అభ్యంతరం లేదని రాత్రే మన వాళ్ళందరికీ ఆదేశా లిచ్చాను."

"అదేనండీ! ఆ డాక్టరమ్మ సరస్వతీదేవిగాని, వాళ్ళ వాళ్ళుగాని ఎవ్వరూ ఆ పేటలో ఏ విషయానికీ ఆధ్వర్యం వహించడానికి వీల్లేదు— అంతేనా? మీా రలా చూస్తూ ఊరుకోండి— అన్ని ఏర్పాట్లూ నే చేసుకుపోతాను."

ఏదో గుర్తు కొచ్చి క్షణం ఫాలభాగాన్ని రుద్దుకొన్నాడు గంగాధరరావు.

"చూడు, శర్మా! జనం ఆ సత్యం గాణ్ణి చూడ్డానికేమీ విరగబడ్డం లేదు గదూ?"

"ఎందుకు లేదండి, బాబూ! అదే నే చెప్పొచ్చేది. సాక్షాత్తూ సరస్వతీదేవే పొద్దున్న నే వెళ్ళేసరికి వాడి మోచేతికి స్వయంగా నవనీతం పూస్తున్నది. ఊళ్ళో అలగా వెధవల మాట చెప్పనక్కర లేదు."

చెవులు గట్టిగా మూసుకోవాలనిపించింది గంగాధరరావుకి.

ముఖంలో ఏదో తీవ్రమైన బాధ. అది కాస్త గమనించాడు శర్మ.

"ఏ సంబంధమూ లేకపోతే వాడి మీాద ఆమె కెందుకండీ అంత అప్యాయత!"

తటాలున ఇటు తిరిగాడు గంగాధరరావు.

ఉత్సాహంగా అందుకొన్నాడు శర్మ:

"మొన్ననేమో బట్టలుకుట్టుకోమని ఓ తాను పంపించిందట. అంతకుముందే గుండెల్లో ఏదో నొప్పి వస్తే తన స్వంత హాస్పిటల్లో ట్రీట్‌మెంటు ఇచ్చి లన్ని ఖర్చులూ తనే భరించి నెల రోజులు మేపిందటండీ వీణ్ణి. ఊరంతా అప్పుడే గుప్పుమంటున్నది లెండి."

సర్దుకొని కూర్చున్నాడు గంగాధరరావు. సత్యా సత్యాల సంగ తెలా ఉన్నా ఒక మంచిని వినేదానికంటే చెడును వినడంలో బలే ఆసక్తి ఉంటుంది మనిషికి. ఆ విషయం శర్మకి బాగా తెలుసు.

"నాలుగు రోజుల క్రితం రాత్రి పది గంటల వేళ వాడు తన గదిలో మెషిన్ కుట్టుకొంటూంటే ఆమె తాలూకు, నౌకరు వచ్చి ఏదో కబురు చెప్పాడు వీడికి. అంతే— తక్షణం ఎక్కడ పని అక్కడ వదిలేసి వాడి వెనకాల వెళ్ళిపోయాడు. వీధిలో మే మంతా చూస్తూనే ఉన్నాం కదండీ!"

ఇంతదాకా కాస్తంత ఉపశమనం లభించినా గంగాధరరావు హృదయంలో మళ్ళీ ఓ విధమైన కొత్త బాధ పుట్టింది. చాలా విసుగ్గా అన్నాడు:

"ఎందుకయ్యా వాడంటే ఈ ఆడవాళ్ళంతా ఇలా పడి చచ్చిపోతుంటారూ?"

రామశర్మ నోరెత్తలేదు. గంగాధరరావు అడిగినదానికి సమాధానమంటూ చెప్పవలసివస్తే సత్యం గురించి ఒక్క మాటైనా మంచి మాట చెప్పవలసి వస్తుంది మరి.

కాస్సేపు మౌనం తరవాత గంగాధరరావే అన్నాడు:

"ఆ సరస్వతి చాలా అందంగా ఉంటుంది గదయ్యా!"

"అబ్బో! పాలరాతిబొమ్మ కదండీ! ఆ రంగు! ఆ బిగువు! . . . ఆడదంటే. . ."

జయప్రద లోపలినుండి సావిట్లోకి వచ్చింది. ఏదో చెప్పబోతున్నవాడల్లా చటుక్కున ఆగిపోయాడు శర్మ.

కళవళపడుతూ గంగాధరరావు కూతుర్ని పలకరించాడు.

"ఏమిటమ్మా విశేషం? ఊళ్ళోకి గాని బయలుదేరావా?"

"అవును, నాన్నా! జరిగిన ఘోరాన్ని ఒక్కసారి కళ్ళారా చూసి వద్దామని నేతాజీపేటకు వెళుతున్నాను." ఆమె ముఖం కందగడ్డలా ఉంది. రాత్రంతా నిద్రలేక కాబోలు కళ్ళు బాగా ఉబ్బి ఉన్నాయి. ఆమె అక్కడ ఆగకుండా వెంటనే బయటికి వెళ్ళిపోయింది.

పది గంటలకల్లా భోజనాలు వడ్డించడం ప్రారంభించారు నేతాజీపేటలో. దాదాపు ఒంటి గంట వరకూ ఆ సంరంభం సాగుతూనే ఉంది.

మధ్యాహ్నం రెండు గంటల వేళ కాలిపోయిన నేతాజీపేటను సందర్శించడానికని గంగాధరరావు బయలుదేరాడు. అతని వెనక రామశర్మ ఉన్నాడు. తనవాళ్లనుకొన్నవాళ్ళు ఓ ఏభై మంది దాకా పోగయ్యారు. ప్రతి ఇంటికి వెళ్ళి సానుభూతిపూర్వకంగా ఆ ఇంటి సభ్యుల్ని పలకరించడం ఒక కార్యక్రమం. గొల్లున ఏడుస్తున్నవాళ్ళని ఓదార్చి ధైర్యం చెప్పడం అందులో ఓ భాగం.

మొత్తం ఊరంతా ఇలా చుట్టి వచ్చేసరికి సాయంత్రం నాలుగు గంటలైంది. అభాగ్యులై పడి ఉన్న ఊరి జనమంతా గంగాధరరావుని దేవుణ్ణి చేసి అతని పాదాలపై పడి మొక్కుకున్నారు.

ఆ రోజు పర్యటనలో అతని ఆఖరి కార్యక్రమం హాస్పిటల్‌లో ఒళ్ళు కాలి బాధపడుతున్న వారిని పలకరించడం. దాదాపు పది మందికి ఒళ్ళు కాలి డాక్టర్ సరస్వతీదేవి హాస్పిటల్లో ట్రీట్‌మెంటు పొందుతున్నారు. అందులో ముఖ్యుడు సత్యం. ముందుగా అతని రూములోకే వెళ్ళాడు గంగాధరరావు, తన పరివారంతో.

బెడ్‌మీాద పడుకొని ఉన్నాడు సత్యం. అతని తలవైపున ఉన్న స్టూలుమీాద జయప్రద కూర్చుని ఉంది. ఆమె నక్కడ అలా చూడ్డంతో చాలా వ్యాకుల పడింది గంగాధరరావు మనస్సు. కాని, ఆ మనోభావాన్ని ముఖంలో ఎక్కడా స్పష్టం కానివ్వలేదు.

గంగాధరరావును చూడగానే చటుక్కున లేచి అక్కడఉన్న మరోస్టూలుపై కూర్చోమని ఆహ్వానించాడు సత్యం. అతని కాళ్ళకు, చేతులకు, ఛాతికి కట్లు కట్టి ఉన్నాయి. ఆమాత్రం కదలిక వల్లనే ఉత్పన్నమైన బాధకు గట్టిగా మూలిగాడతను. గభాలున జయప్రద లేచి, డాక్టరమ్మ మాట కాదని లేచినందుకు కోప్పడుతూ అతనికాళ్ళను,చేతుల్నినెమ్మదిగా సర్ది మళ్ళీమామూలుగా సరుండబెట్టింది.

గంగాధరరావు స్టూలుపై కూర్చుని ముందుగా కూతుర్ని పలకరించాడు. "పొద్దున్ననగా వచ్చావు— అప్పట్నించి ఇక్కడే ఉన్నావా, జయప్రదా! పేట పేటంతా ఇంతటి కష్టదశలో ఉన్నప్పుడు ఈ దుఃఖిత మనస్కులతో ఎంతసేపు గడిపినా మనలాంటివారికి తనివి తీరదనుకో! అయినా ఇంటికి ఒక్కసారి వచ్చిపో, అమ్మా! ఇంట్లో అమ్మకి ఒంట్లో బాగు లేదుకదా?"

తలఎత్తి తండ్రి వంక చూసి ముభావంగా ఊరుకొంది జయప్రద.

గంగాధరరావు లేస్తూ, "వస్తానోయ్, సత్యం! నీ గురించి డాక్టరమ్మకి చెప్పవలసిన పనే ఇంకొకరికి ఉండదనుకో. అయినా ఏదో, ఈ స్థితిలో ఉన్న నిన్ను చూసి పోదామని వచ్చాను. నువ్వు ప్రమాదంలో ఉన్నప్పుడు పోలీసులకు చిక్కకుండా ఎవరైతే నిన్ను కాపాడుకొన్నారో, ఆమే ఇప్పుడుకూడా నిన్ను సలక్షణంగా రక్షించుకొంటుంది లే!" అంటూ గుమ్మం దాటుతున్న గంగాధరరావును చూస్తూ చిన్నగా నవ్వుకొన్నాడు సత్యం.

తండ్రి ప్రవర్తనకు నిశ్చేష్టితురాలై జయప్రద అలానే నిలుచుని ఉండిపోయింది.

గంగాధరరావును ఇంటి వరకూ సాగనంపి పరివారమంతా ఎవ రింటికి వారు వెళ్ళిపోయారు. రామశర్మ మాత్రం ఇష్టాగోష్ఠి మాట్లాడడానికి ఉండిపోయాడు.

నాగ నృత్యం

చిత్రం— పి. ఆగాచార్య, కరీంనగర్



గంగాధరరావు భార్యకు ఆ రోజు ఆయాసం మరీ ఎక్కువగా ఉంది. అసలే బాగా ముదిరిపోయిన ఉబ్బసపు రోగం. సంవత్సరాల తరబడీ ఇంట్లో అందరికీ ఆమె జబ్బు చిరపరిచితమే. కాస్త బాగున్న రోజుల్లోకూడా ఎక్కువ కాలం ఆమె మంచంమీదనుంచి కిందికి దిగదు. అసలే ఉధృతమైన రోగోద్రేకం వల్ల రెండు రోజుల నుండీ ఆమె మరీ మంచాన్ని అంటి పెట్టుకు పోయింది. ఇంట్లో పనిపాటీ వంటింటి విషయమూ పెరటిపనీ [illegible] లోనే కదుపు ఈ వేళ వాళ్ళెవరూ పనిలోకి రాలేదు. వంటమనిషి మాత్రం కాస్త ఆలస్యంగా వచ్చి తొందరగా పనులు ముగించుకొని మళ్ళీ ఏదో పనికిపోవాలని వెళ్ళిపోయింది. ఆరింటి దాటి గంగాధరరావు ఇంటికి చేరినా జయప్రద మాత్రం ఇంకా ఇంటికి రాలేదు.

సాయంత్రం ఆరున్నర దాటాక సరస్వతీదేవి నౌకరు వచ్చి సోఫాలో రామశర్మతో కబుర్లాడుతున్న గంగాధరరావుకి ఒక కవరు ఇచ్చి వెళ్ళిపోయాడు.

మహా ఆత్రంగా దాన్ని చించి చదివాడు గంగాధరరావు. ఒళ్ళంతా ఒక్కసారి జలదరించిందతనికి. ఎదురుగా ఉన్న రామశర్మతో అన్నాడు: "చాలా ముఖ్యమైన విషయం మీతో మాట్లాడాలి. రాత్రి తొమ్మిది గంటలకి హాస్పిటల్‌కి రమ్మని వ్రాసింది సరస్వతీదేవి. చాలా మిస్టరీగా ఉంది కదూ?"

"మిస్టరీ ఏముందండి! ఈ వేళ మీరు చూపిన దాతృత్వానికి ఏనాటి శ్రమయినా మీ పాదాక్రాంతం కావలసిందే! అయినా మీ రొట్టె విరిగి నేతిలో పడనున్నది లెండి— డాక్టరమ్మ గారి కన్ను మీ మీదకూడా పడింది. ఇందులో ఏం సందేహం లేదు."

అకస్మాత్తుగా కలిగిన ఆనందానికి లేచి నాట్యం చేయాలనిపించేంత ఉద్వేగం కలిగింది గంగాధరరావుకి.

హాస్పిటల్ వరకూ తనను పోనిమ్మని ఫోనుదుప్పగాని ఉండమని రామశర్మతో చెప్పి, గబగబా వెళ్ళి స్నానం చేసి వచ్చాడు. ఇస్త్రీ బట్టలు కట్టుకొన్నాడు. పైమీద సెంటుపోసి జరీకండువాకికూడా అత్తరువు పట్టించాడు. చేతికర్ర పట్టుకొని, చెప్పులు తొడుక్కొని రామశర్మతో కలిసి గుమ్మం దాటబోతుండగా అప్పుడే బయటినుంచి వస్తున్న జయప్రద ఎదురైంది.

ఆమెను చూడగానే మిన్ను విరిగి మీద పడ్డంత బాధ పడ్డాడు గంగాధరరావు. చెప్పులు తీసేసి వచ్చి సోఫాలో కూలబడ్డాడు.

తల వంచుకొని లోనికి వెళ్ళబోతున్న కూతుర్ని పిలిచి హెచ్చరిల్లిన కోపంతో గట్టిగా అన్నాడు: "ఏం, ఇంతవరకూ వాడి దగ్గరే ఏమి అఘోరిస్తున్నావా! ఇప్పటికైనా వాడు నీకు అనుమతి ఇవ్వలేదా ఇంటికి వెళ్ళడానికి?"

నిర్లక్ష్యంగా చూసింది జయప్రద తండ్రి వంక.

"ఎందుకు, నాన్నా, అంత గట్టిగా కేకలేస్తావు! సత్యం పరిస్థితి చూస్తేనా బాగాలేదు."

పట్టరాని కోపంతో పిచ్చెక్కి పోయాడు గంగాధరరావు.

"ఎవడెలా తగలబడితే నీ కెందుకు! వాడు నీ కేమవుతాడని ఇంత అభిమానం?"

నిష్పృహగా నవ్వింది జయప్రద.

"అర్ధరాత్రి [illegible] అమాయకంగా నిద్రపోతున్న పిల్లల్ని, పెద్దల్ని, ఆస్తుల్ని సాధ్యమైనంతవరకూ రక్షించడానికి అతను చేసిన సాహసం గురించే నా కింత అభిమానం, నాన్నా!"

"అంతకంటె వెయ్యిరెట్లు సహాయ కార్యక్రమాలు తెల్లవారకుండా చేసిన నా గురించి నీ కేమీ అభిమానం లేదూ?"

"లేదు, నాన్నా! పైపెచ్చు భరించరానంత దుఃఖంతో క్రుంగిపోతున్నాను."

ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసుకొన్నాడు గంగాధరరావు. క్రుద్ధుడై అన్నాడు: "నీ తండ్రి ఉదయంనుంచీ చేస్తున్న ధర్మకార్యాల్ని చూస్తూ నువ్వు క్రుంగి పోతున్నావా? ఊరు ఊరంతా నీ తండ్రికి పాదాక్రాంత మవుతుంటే, నీవు భరించ లేకపోతున్నావా?"

జయప్రద స్థిరంగా నిలబడి చేయి చాపి రామశర్మను చూపుతూ అంది: "రాత్రి నేలమట్టమైపేటను తగులబెట్టేందుకు ఒక్క అగ్గిపుల్ల గీసి రావడానికి ఈ రామశర్మకి ఎంత ఇచ్చావు, నాన్నా?"

పిడుగు పడ్డట్టు అదిరిపడ్డాడు గంగాధరరావు.

జయప్రద కంఠం బాగా తీవ్రతరం అయింది. "నీ పెట్టెల్లో నల్ల ధనం తరగడానికీ, జనంలో కీర్తిప్రతిష్ఠలు సంపాదించడానికీ ఇంతకంటె కుత్సితమైన మార్గం నీకు దొరకలేదా! ఇంతటి భయంకర పరిస్థితిని సృష్టించి, వచ్చే సారి ఎలెక్షన్లో నీ అధికారాన్ని రక్షించుకొంటావా? భగవంతుడు నిన్ను క్షమించడు, నాన్నా! ఈ రకమైన కీర్తి నీకు లభించడానికి వీల్లేదు. రాత్రి నుంచీ ఈ రహస్యాన్ని గుండెల్లో పెట్టుకొని దాచి ఉంచాను. ఇంకా దాచి నేను ఆత్మవంచన చేసుకోలేను. ఇప్పుడే వెళ్ళి ఆ డాక్టరమ్మ కీ విషయం యావత్తూ తెలియచేస్తాను."

కూతురు ధోరణికి తల తిరిగినట్లై మహా భయంకరంగా అరిచాడు గంగాధరరావు: "గడప దాటి బయటికి వెళ్ళావా— నువ్వు బ్రతికి మళ్ళీ ఈ గుమ్మం ఎక్కలేవు, జాగ్రత్త!"

అడుగు వెనక్కి వెయ్యలేదు జయప్రద. అణుకోలేనంత కోపంలో చేతికర్ర పైకెత్తి కూతురి తలపై గట్టిగా మోదాడు గంగాధరరావు. ఆ దెబ్బకి ఆమె తల చిట్లి రక్తం ముఖంమీదుగా కారసాగింది.

[illegible] కేకలు విని లేచి మంచంపై మూలుగుతూ ఉన్న గంగాధరరావు భార్య లేచి తూలుతూ, తడబడుతూ హాల్లోకి వచ్చింది.

వీధి గుమ్మం దాటబోతున్న కూతుర్ని అప్రయత్నంగా పిలిచింది— "జయప్రదా! వెళ్ళకు, తల్లీ! నా మాట విను! అయ్యో! ఆ రక్తమేమిటి, తల్లీ!" అంటూ తనకు అడ్డుపడి ముందు కెళుతున్న భార్యను కోపంగా వెనక్కి లాగాడు గంగాధరరావు. అసలే నీరసంతో ఉన్నందున ఆమెకు వెంటనే స్పృహ తప్పి నేలపై కుప్పలా కూలబడింది. కంగారుగా వంగి భార్యను లేవనెత్తడానికి ప్రయత్నించాడు గంగాధరరావు. అప్పటికే ఆమె శరీరం పూర్తిగా చలనం కోల్పోయి ఉంది. ఈలోగానే బయటికి వెళ్ళి పోయింది జయప్రద.

అంతా చూస్తున్న రామశర్మకు పట్టలేని భయం పుట్టుకొచ్చింది. వెంటనే గంగాధరరావుకి నమస్కరించి, "ఇక్కడ ఇంకో క్షణం నే నుంటే జనం నన్ను నిలువునా పాతేస్తారు. ఈ చీకటి కాస్త ఉండగానే ఎలాగో మరో ఊరు చేరి పోవాలి. ఈ లోపులో ఎవడి కంట పడినా ఈ నేలపై నా నూకలు పూర్తిగా చెల్లిపోతాయి— సందేహం లేదు" అంటూ గాభరాగా బయటికి వెళ్ళిపోయాడు.

అనుకోకుండా పరిస్థితు లిలా విషమించడంతో గంగాధరరావు ధైర్యమంతా ఒక్కసారిగా దిగజారిపోయింది.

గబగబా వెళ్ళి వీధి తలుపు గడియ పెట్టి వచ్చాడు. నేలపై స్పృహ తప్పి పడి ఉన్న భార్యను ఎత్తుకొని వెళ్ళి గదిలో మంచంపై పడుకోబెట్టి పక్కనే కూర్చున్నాడు.

చిన్న అలికిడైతే అతని గుండెలు టపటపా కొట్టుకొంటున్నాయి. ఏ నిమిషాన్నయినా జనం తన ఇంటిపైకి దాడి రావచ్చు. కర్రలతోనూ, కత్తులతోనూ పొడిచి తనను క్రూరాతిక్రూరంగా చంపవచ్చు.

జీవితంలో ఏనాడూ ఎరగని అదో విధమైన భయం విశ్వరూపం దాల్చి అతని హృదయాన్ని పట్టి మహా తీవ్రంగా గుంజుతుంటే, గజగజా వణికిపోతూ ముఖం మోకాళ్ళ మధ్యగా పెట్టుకొని బిక్కు బిక్కుమంటూ ఒక్కడూ కూర్చున్నాడు, ఎంతకీ స్పృహ రాని భార్య దగ్గర.

హఠాత్తుగా వీధి తలుపు నెవరో తట్టుతున్న శబ్దానికి అదిరిపడి తల ఎత్తాడు గంగాధరరావు.

అర్ధరాత్రి అయిందన్నట్టుగా గోడ గడియారం ధన్ ధన్ మంటూ పన్నెండు గంటలు కొట్టింది. ★



విరహోత్కంఠిత
చిత్రం—వి. ఆర్. కె. బి. రావ్
(విశాఖపట్నం)